



# గులాబీ అక్కచెల్లెళ్లు!

పెళ్లిచూపులు...
ఆమె కళ్లు మాత్రమే కనిపించాయతనికి.
అచ్చం తన ప్రేయసి కళ్లలాగే ఉన్నాయి.
ఇక, మరో ఆలోచన రాలేదు.
గులాబీ... ప్రేమకు చిహ్నం.
దాన్ని చూడగానే మనకు ప్రియమైన వారు, ఆ తాలూకు బహుమతులే గుర్తుకు వస్తాయి. అచ్చం దానిలాగే, ఇంకొన్ని పువ్వులూ ఉన్నాయి. గులాబీ అక్కచెల్లెళ్లలా కనిపించే వీటిని చూసినా మనసు అంతే ముచ్చట పడుతుంది. మీరూ మా గులాబీలాగే ఉన్నారు పూబాలగారూ... అంటూ పలకరించేస్తుంది. పోలికకే కాదు... కానుకకూ బాగుండే వీటిని మనమూ పరిచయం చేసుకుందామా?!

## రనన్క్యులస్

బ్రహ్మదేవుడి సృష్టిలో గులాబీలుంటే, విశ్వామిత్రుడి ప్రతిసృష్టిలో రనన్క్యులస్‌లు ఉన్నాయేమో అనిపిస్తుంది ఈ పువ్వుల్ని చూస్తుంటే. అందం, ఆకర్షణలోనే కాదు, రూపంలోనూ గులాబీకి సరిసాటి ఇవి. అందుకే వీటిని రనన్క్యులస్ రోజ్‌లుగానూ పిలుస్తారు. రోజాల్లాగే ఎరుపు, గులాబీ, నారింజ, పసుపులాంటి నిండైన రంగుల్లో ఆకట్టుకుంటాయివి. ఆకర్షణకు చిహ్నంగా వీటిని చెబుతారు. ఇక, ఈ పుష్పాల నుంచి వచ్చే సువాసన కూడా రోజా పువ్వు మాదిరిగానే ఉంటుంది. అందుకే గులాబీ అక్కచెల్లెళ్లలో దీనిది మొదటి స్థానం. వేజుల అలంకరణ కోసం పెంచే ఇవి, ఇంట్లోని కుండీల్లోనూ పెరుగుతాయి. అంటార్కిటికా మినహా అన్ని ఖండాల్లోనూ ఈ పూలు పూస్తాయి. అయితే ఈ చెట్టుకు గులాబీలా ముళ్లుండవు. ఒక్కమాటలో చెప్పాలంటే... ఆ గులాబీ గుచ్చుకుంటుంది...ఈ గులాబీ గుచ్చుకోదు! మిగతాదంతా సేమ్ టు సేమ్.





## పెయోనీస్

అలంకరణలో అధికంగా ఉపయోగించే పెయోనీస్ పువ్వులు కూడా అచ్చం గులాబీల్లానే కనిపిస్తాయి. ఆసియా, ఐరోపాలతో పాటు అమెరికాలోని ఉష్ణమండల ప్రాంతాల్లో ఇవి పెరుగుతాయి. మంచి సువాసనతో పసుపు, తెలుపు, ఎరుపు, ఊదా... ఇలా ఎన్నో రంగుల్లో పూస్తాయి. వీటిలో దాదాపు 33 విభిన్న రకాలు ఉన్నాయి. పింక్ హవాయియన్ కోరల్‌కు ఎక్కువమంది అభిమానులు ఉంటారు. పెద్ద గులాబీని పోలి ఉండే ఇది బొకేలు, వేజులు, మండపాలు... ఇలా ఏ అలంకరణలో అయినా ప్రత్యేకంగా కనిపిస్తుంది మరి!



